నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

• ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీ నగర్, కేపీహెచ్‌బీ డివిజన్లలోని వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా మొత్తం రూ.5 కోట్ల 50 లక్షలతో పార్కులు అభివృద్ధి చేశామని తెలిపారు. బాలాజీనగర్‌లోని రోడ్డు నెంబర్:1లో సరోజినీ నాయుడు పార్కు, భగత్‌సింగ్ నగర్ పార్కు, అదే విధంగా ముస్లిం గ్రేవ్‌యార్డ్‌ను ప్రారంభించారు. అనంతరం కేపీహెచ్‌పీ డివిజన్‌లోని క్రిస్టియన్ గ్రేవియార్డ్‌లోని వెయిటింగ్ రూమ్ ప్రారంభించిన, అనంతరం 7వ ఫేజులోని ఎనర్జీ పార్కును ప్రారంభించారు. అనంతరం విశ్వంభర వద్ద వాటర్ ట్యాంక్, పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్లలో ఒకొక్క పార్కు ఒక్కో రకంగా తీర్చిదిద్దామని, ప్రతి ఒక్కరూ తప్పకుండా సందర్శించి ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ముందుకు వెళ్తున్నారని, ఆయన సహాయ సహకారాలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానన్నారు. అదే విధంగా పార్కుల ద్వారా చిన్నారులకు విజ్ఞానం కలుగుతుందని, పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. 7వ ఫేజులో రూపొందించిన సోలార్ ఎనర్జీ పార్కు పిల్లలకు చూపించడం ద్వారా వారికి సోలార్ ఎనర్జీ గురించి విద్యుత్ వినియోగం గురించి అవగాహన కలుగుతుందని, పిల్లలతో పాటు పెద్ద కూడా అన్ని విషయాలను తెలుసుకుంటారని తెలిపారు. గత 70 ఏళ్లుగా ఎవరూ చేయనటువంటి కార్యక్రమాలు నేడు చేసుకుంటున్నామంటే అది కేవలం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. అదే విధంగా పాదయాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించటానికి నూతనంగా శంకుస్థాపనలు చేసి పనులను పూర్తి చేస్తున్నామన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీష బాబూరావు, కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ శిరీష బాబూరావు తదితరులు



కేపీహెచ్‌బీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

క్లుప్తంగా

యోగా శిక్షణ



కూకట్‌పల్లి: సద్గురు యోగా సాధన కేంద్రం, గోకుల్ ప్లాట్స్ బ్రాంచ్ 3వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా ఆదివారం గోకుల్ ప్లాట్స్ వద్ద ఉన్న క్వాంటమ్ లీప్ స్కూలులో ఉదయం 5.30 గంటలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. పూజ్య గురూజీ నరేంద్ర బంధుజీ ఈ యోగా తరగతుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి రోజూ నిర్వహించే యోగా తరగతులను నామమాత్రపు ఫీజుతో నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ ఇన్‌చార్జి మందపాటి చంద్రశేఖర్, జీవీఆర్ తెలిపారు.

కేసీఆర్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మతిపోవడం ఖాయం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతోనే ప్రతిపక్షాలు ఉక్కిరిబిక్కిరవుతుంటే మరికొన్ని రోజుల్లో కేసీఆర్ ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మతిపోవడం ఖాయమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు 3016 నుంచి 4016కు పెరిగిన ఉత్తర్వుల కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలో మరే రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో అందుతున్నాయన్నారు. ఇతర రాష్ట్రాల వారు కూడా మన రాష్ట్రంలోని పథకాలను అనుసరిస్తున్నాయన్నారు. ఇక ఎన్నికల సమీపిస్తున్న వేళ బస్తీలకు, కాలనీలకు రకరకాల రంగురంగుల జెండాలు పట్టుకొని కొందరు వస్తారని వారు నోటికి ఏది వస్తే అది చెబుతుంటారని వారి మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో తాను పని చేసిన పార్టీలో మంత్రిగా పని చేసినప్పటికీ కూడా ఇంత మందికి సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఉన్నప్పుడు రూ. 200 పింఛన్ అందరికీ రావడం కూడా గగనంగా ఉండేదని కానీ ఇప్పుడు దివ్యాంగుల, వితంతు, వృద్ధాప్య పెన్షన్లు పెద్ద ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 17 వేల మందికి తాము పెన్షన్లు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలి

మియాపూర్: మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్‌లోని నీలిమ హైట్స్, గ్రీన్స్‌లో మెడికవర్ ఆసుపత్రి చందానగర్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలతో పాటు ఈసీజీ తదితర పరీక్షలను వైద్యులు నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం, నడక, యోగా వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆదిత్య, రామ్, వింధ్య, కాలనీ వెల్ఫేర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రమేష్, సాంబశివరావు, సీతారాం, రాజేంద్రప్రసాద్, రాహుల్, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాలకు ప్రాధాన్యం

నిజాంపేట్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సేవా సంస్థ వందేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తోందని లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు అన్నారు. ఆదివారం నిజాంపేట్ బండారి లేఅవుట్‌లో జరిగిన హైదరాబాద్ ప్రగతి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్ రాజు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని, తమది ప్రపంచంలోనే పెద్ద సంస్థ అని, గిరిజన ప్రాంతాల్లో సైతం తమ సేవలను విస్తృత పరిచామని పేర్కొన్నారు. గీతం టీవీ చైర్మన్, డాక్టర్ చెరుకూరి రామ్‌తిలక్ అధ్యక్షుడిగా, జగ్గయ్య కార్యదర్శిగా, గోపి రాజు కోశాధికారిగా, లయన్ సత్యవోలు రాంబాబు, ఎల్లా సుబ్బారెడ్డి, డాక్టర్ మహేశ్ పగడాల, తోట రామకృష్ణ, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, శిల్పలత, మల్లీశ్వరి, అరుణశ్రీ, కృష్ణ మురళి, మాల్యాద్రి, ప్రశాంత్ రెడ్డి, మేఘన నూతన సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ పీఆర్‌వో లయన్ యాదయ్యగౌడ్, లయన్స్ చందు ముదిరాజ్, వెంకటేశ్వర దాస్, మర్రి భిక్షపతి, నరసింహ రాజు, ఈశ్వర్ రెడ్డి, పి.ఎస్.ఎన్.రాజు, శ్రీనివాస్, లింగయ్య, కిశోర్ కుమార్, సంపత్, రమాకాంత్, పవన్, విజయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

భట్రాజులను ఆదుకోవాలి



ఆత్మీయ సమ్మేళనంలో రవికుమార్‌యాదవ్, విష్ణువర్ధన్ రాజు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ భట్రాజుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సాయినగర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రవికుమార్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్ రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమం మాజీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు బొల్లేపల్లి సీతారామరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆ రోజుల్లో భట్రాజులు చాలా విద్యావంతులుగా గ్రామాల్లో విద్యను నేర్పిన భట్రాజులుగా ఉండే వారని, మారిన పరిస్థితుల పట్ల వారు చాలా వెనుకబడి పోయారన్నారు. వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రాజు మాట్లాడుతూ.. చాలా వరకు భట్రాజులు తమ కాళ్లపై తాము నిలబడుతూ బతుకున్నామని, మాకు ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి చేకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 800 మంది భట్రాజులు హాజరై ఐక్యతను చాటారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ రాజు, కరుణాకర్‌రాజు, శ్రీనివాసరావు, విజయరాజు, గోమాత ప్రభావతి, వసుధారాణి పాల్గొన్నారు.

చిన్నారుల పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నాగార్జున హోమ్స్ కాలనీలో రూ.12లక్షల ఎమ్మెల్యే నిధులతో నూతనంగా చిల్డ్రన్స్ ప్లే పార్కును ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జున హోమ్స్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు చిన్న పిల్లల ఆట స్థలంలో పార్కుకు ఎమ్మెల్యే నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. పార్కును అన్ని రకాలుగా సుందరీకరించి, అన్ని మౌలిక వసతులతో ఆధునీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకువచ్చాం అన్నారు. చిన్నారులు కాసేపు ఆడుకుంటూ సేద తీరడానికి ఈ పార్కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.పిల్లల కోసం అన్ని రకాల ఆటల వస్తువులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు,కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్రకళా ప్రదర్శన



వస్త్రకళా హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రదర్శనలో కొనుగోలుదారుల సందడి

నిజాంపేట్: ప్రగతినగర్ శ్రీకృష్ణ గార్డెన్‌లో వస్త్రకళా హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో చేనేత వస్త్రాలు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన చీరలు, కాటన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గృహ ఉపకరణాలు, కళాకారులచే తయారు చేసిన బొమ్మలు అందరికీ అందుబాటులో ఉంచామని నిర్వాహకులు సింహాద్రి తెలిపారు. దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని మూడు కాటన్ టాప్‌లు రూ.వెయ్యికే అందిస్తున్నామన్నారు. అదే విధంగా ఈ ప్రదర్శనలో వన్‌గ్రామ్ గోల్డ్ జైపూర్ స్టోన్ జ్యువెలరీ ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి అందుబాటులో ఉంటుందని, కొద్ది రోజులు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బతుకమ్మ చీరల పంపిణీ

కూకట్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండగను పురస్కరించుకొని మహిళలకు అందజేస్తున్న బతుకమ్మ చీరలను ఆదివారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆస్‌బెస్టాస్ కాలనీలో, అదే విధంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శంషీగూడ వార్డు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ పేదింటి ఆడపడుచులు కూడా పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ సర్కారు బతుకమ్మ చీరలను అందజేస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన చీరలను నేత కార్మికులకు అప్పగించి వారి బతుకుల్లో వెలుగులు నింపుతుందన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి పార్టు డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాగేశ్వరావు, అబ్బులు, ప్రబాకర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, సీఓ ముస్తఫా, శివరాజ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, పద్మయ్య, సంతోష్ బిరాదర్ పాల్గొన్నారు.

చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన

కూకట్‌పల్లి: ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజున 16 ఏళ్ల లోపు పిల్లలకి 2 చుక్కలు స్వర్ణామృత ప్రాశనను వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం యోగేష్ ప్రభు అందజేశారు. ఈ స్వర్ణామృత ప్రాశన వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి మెదడును ఉత్తేజపరుస్తాయన్నారు. ఈ ద్రవ్యాలు, దేశీ ఆవు నెయ్యి, తేనెతో తయారు చేయబడిన ఒక ప్రత్యేకమైన చుక్కల రూపంలోని టీకా పద్ధతి అని, దీనిని సరైన మోతాదులో 16 ఏళ్లలోపు పిల్లలకు ఇవ్వబడుతుందని తెలిపారు. దీని వాడటం వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెంచటంతో పాటు మాటలు ఆలస్యంగా వస్తున్న పిల్లలకు సహాయపడుతందని, శరీర క్రియలు వేగవంతం చేస్తుందని తెలిపారు. పిల్లల ఆలోచనలను పెంపొందిస్తుందని, అతి ప్రవృత్తి పిల్లల్ని మెరుగుపరుస్తుందన్నారు. అరుగుదలని మెరుగు పరుస్తుందని ఇటువంటి ప్రత్యేక లక్షణాలు ఈ స్వర్ణామృత ప్రాశన తీసుకోవటం వల్ల కలుగుతాయని యోగేష్ ప్రభు తెలిపారు.



చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన వేస్తున్న యోగేష్ ప్రభు

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న కాశీం

ఉస్మానియా యూనివర్సిటీ: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రొ.సూరజ్ మండల్ (బీపీ మండల్ మనుమడు) అన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో చట్టసభల్లో (శాసన మండలి, అసెంబ్లీ, పార్లమెంట్) బీసీలకు రిజర్వేషన్లు అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఓయూ అధ్యాపకులు కాశీం అధ్యక్షత నిర్వహించగా ప్రొ.సురజ్‌మండల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభలో వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల ద్వారానే సామాజిక న్యాయం జరిగి అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సమావేశంలో ప్రొ.ప్రభంజన్ యాదవ్, వంగ బీఎస్పీ రాష్ట్ర నాయకుడు కంచర్ల భద్రీ, రాములుగౌడ్, నరేందర్‌గౌడ్, నాగేష్‌ముదిరాజ్, రమణ, స్వరూప పాల్గొన్నారు.

ట్రైబల్ యూనివర్సిటీలో విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ములుగులో త్వరలో ఏర్పాటు చేయనున్న ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్య,ఉపాధి అవకాశాలు 80శాతం గిరిజనులకే కల్పించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో గిరిజన శక్తి ఆధ్వర్యంలో ట్రైబల్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఈ క్రమానికి గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ అధ్యక్షత వహించగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నవంబర్ రెండో వారంలో సరూర్‌నగర్ స్టేడియంలో లంబాడీల సింహగర్జన మహాసభను నిర్వహించనున్నట్లు శరత్‌నాయక్ తెలిపారు.అనంతరం 34అంశాలతో గిరిజన డిక్లరేషన్‌ను విడుదల చేశారు.గిరిజనులు ఎక్కువ శాతం ఉన్న జనరల్ ఎమ్మెల్యే సీట్లలో 10సీట్లను ఎస్టీలకు కేటాయించాలి, జీవో నంబర్-3ను పునరుద్ధరించాలి, ట్రైబల్ వర్సిటీలో 80 శాతం ఉద్యోగాలు, సేవలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి, ఎస్టీ కమిషన్ ఏర్పాటు, పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి తదితర అంశాలను డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి నాయకులు సుబ్బునాయక్, రాజునాయక్, విజయ్ నాయక్, సిద్ధార్థనాయక్, ఓయూ నేతలు హనుమంత్ నాయక్, నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

పంజగుట్టలో కార్డన్ సెర్చ్

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి తర్వాత పంజగుట్ట పోలీసులు కార్డన్ సెర్చ్‌ను నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు బస్తీలతో పాటు కాలనీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఏసీపీ మోహన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్ పరిశీలించారు. సుమారు 150 మంది పోలీసులతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బంజారాహిల్స్: ఆడ బిడ్డకు పెళ్లి చేసిన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దని, వారికి ప్రభుత్వం భరోసాగా ఉండాలనే ఆలోచనతోనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తీసుకొచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆదివారం ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన షేక్‌పేట మండల పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసిల్దార్ అనితారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఆడబిడ్డ పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యంలోకి వచ్చేంత వరకు ఎన్నో పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. గృహలక్ష్మి పథకం కింద కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులు అందాయని అర్హులైన ప్రతి ఒక్కరిని లబ్ధిదారులను చేయించే బాధ్యత తనదేనని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 56 మంది లబ్ధిదారులకు చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్, స్థానిక బీఆర్ఎస్ నేత మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం మల్లికార్జుననగర్ కాలనీ వాటర్ వర్క్స్ కార్యాలయం సమీపంలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వాటర్ వర్క్స్ మేనేజర్ తేజతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె జంగయ్య, మేకల హరినాథ్, ఖదీర్, కృష్ణారెడ్డి, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, జంగీర్, సోఫీ, అశోక్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, జేకే కుమార్, సంపత్, వీరేష్, కేశవ్, ఇర్ఫాన్, ఇస్మాయిల్, నాగేష్, ప్రదీప్, సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ‘ఆరు హామీల’పై ఇంటింటి ప్రచారం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు ఆరు హామీల కార్యక్రమాల కోసం ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో గ్యారెంటీ కార్డు పోస్టర్‌ను జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్, బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షుడు గొల్యాల రాజు, శ్యాం, అశోక్‌కుమార్, రమేష్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. కాంగ్రెస్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఖైరతాబాద్‌లో రాబోయేది, ఎగిరేది కాంగ్రెస్ జెండాయేనన్నారు. ఈ ఆరు హామీలు బడుగు, బలహీన వర్గాలకు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాసం, చేయూత కార్యక్రమాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు.

పేదల సొంతింటి కల

నెరవేరిన వేళ !



డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే గాంధీ

- నల్లగండ్లలో 216 ‘డబుల్’ ఇళ్ల నిర్మాణం
- 2017లో శంకుస్థాపన.. 2023లో నిర్మాణం పూర్తి
- లబ్ధిదారులకు అందించిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరింది. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మొదటి సారిగా నల్లగండ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం విశేషం. ఆరేళ్లుగా అప్పుడు.. ఇప్పుడు అంటూ నిర్మాణం సాగదీసినప్పటికీ.. ఎట్టకేలకు పూర్తి చేయడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో నిర్మాణం పూర్తై లబ్ధిదారులకు అందాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఎమ్మెల్యే గాంధీ చేతుల మీదుగా అందించారు. తాము ఒక్క రూపాయి చెల్లించకుండా పూర్తిగా ఉచితంగా ఇళ్లు అందించడంతో పేదల సంతోషానికి అవధులు లేకుండా పోయింది.



నల్లగండ్ల వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు

దశలవారీగా అర్హులందరికీ ‘డబుల్’ ఇళ్లు



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అర్హులందరికీ దశల వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తాం. నల్లగండ్లలో 216 ఇళ్లను నిర్మించాం. కొల్లూరులో మూడు విడతల్లో ఇప్పటి వరకు 2,819 మంది లబ్ధిదారులకు డ్రా ద్వారా ఇళ్లను అందించాం. శేరిలింగంపల్లిలో కూడా వీటి నిర్మాణం కోసం ప్రణాళిక రూపొందించాం. లబ్ధిదారుల్లో దివ్యాంగులు 70 మంది, ఎస్సీలు 479, ఎస్టీలు 169, ఇతరులు 2,101 మంది ఉన్నారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా పేదవారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. నిరాశ్రయులైన కొందరికి కూడా ఇళ్లను కేటాయించాం.

–ఆరెకపూడిగాంధీ ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే శేరిలింగంపల్లి

ఎంతో సంతోషంగా ఉంది



ఎన్నో ఏళ్ల మా సొంతింటి కల నెరవేరింది. మేము పేదలం. స్థలం కొనడం, ఇల్లు కట్టుకోవడం చాలా కష్టమనే భావనతో ఉన్నాం. కానీ ప్రభుత్వ చొరవతో మాకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇల్లు లేని పేదలందరికీ ఈ ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాల్సిన అవసరం ఉంది.

– మాడపాటి సౌజన్య, నల్లగండ్ల ‘డబుల్’ ఇంటి లబ్ధిదారు

నల్లగండ్ల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వివరాలు:

- 2017 నవంబర్ 11న నల్లగండ్లలో డబుల్ బెడ రూమ్ ఇళ్లకు నగర మేయర్ బొంతు రామ్మోహన్ చేతుల మీదుగా శంకుస్థాపన
- 2018 డిసెంబర్‌లో పూర్తి చేయాలని సంకల్పించారు.
- 1.58 ఎకరాల్లో రూ.18 కోట్లు వ్యయంతో 216 ఫ్లాట్ల నిర్మాణం
- సీప్లస్ జీప్లస్ 9పద్ధతిలో ఈ ఫ్లాట్స్ నిర్మించారు.